క్లుప్తంగా

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం



చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు భారీ విరాళం అందజేశారు. ఆరిలోవలో ఎస్.సుబ్బలక్ష్మి అనే మహిళ నిర్వహిస్తున్న ఈ ఫౌండేషన్‌కు విరాళం అందజేయడానికి శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇటీవల రూ.2,44,552 వరకు విరాళాలు సేకరించారు. ఆ నగదును చెక్కు రూపంలో గురువారం పాఠశాలలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ సమక్షంలో ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.సుబ్బలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీఐ అభినందించారు. చిన్నతనం నుంచే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన కలగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత ముని మోహన్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత దినోత్సవం



సంస్కృతం అధ్యాపకుడు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంస్కృతం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ ఉమామహేశ్వరరావును ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్కృతం మన ప్రాచీన భాష అని, అన్ని భాషలకు తల్లి లాంటిదని చెప్పారు. సమస్త సాహిత్యం సంస్కృతంలోనే ఇమిడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు



బాలికలకు ఐరన్ మాత్రలు అందిస్తున్న ఆశ వర్కర్ స్వాతి

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కంచరపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పి.మణి, గోక స్వాతి పర్యవేక్షణలో బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేసి, ఐరన్ మాత్రలు అందించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి పలు సూచనలిచ్చారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అబిద్‌నగర్ పార్కు అభివృద్ధికి సహకారం

సీతంపేట: ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ మేనేజర్ ఆపరేషన్స్ వై.కె.కె.శాస్త్రి, క్లస్టర్ హెడ్ ఆర్.విజయశ్రీ, బ్రాంచి మేనేజర్లు ఎం.బి.రాజేష్, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పార్కు అభివృద్ధికి సహకరిస్తామన్నారు. అబిద్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు యు.కిశోర్, ఎస్.వి.ఆర్.ప్రసాద్, జఫరుల్లా ఖాన్ పాల్గొన్నారు.



35వ వార్డులోని ప్రసాద్‌గార్డెన్స్‌లో గల డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం

ఆరోగ్యమస్తు

- ప్రజారోగ్యానికి వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భరోసా
- రోగులకు మెరుగైన వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల పరీక్షలు
- రోజుకొక ప్రత్యేక డాక్టర్‌చే వారమంతా ట్రీట్‌మెంట్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

రోజు వారీ అందే సేవలు..

సోమవారం	: జనరల్ వైద్యం
మంగళవారం	: ప్రసూతి, ఎముకలు
బుధవారం	: చిన్నపిల్లలకు
గురువారం	: చర్మవ్యాధులకు
శుక్రవారం	: ఈఎన్‌టీ, జనరల్
శనివారం	: గుండె వ్యాధులకు

జగదాంబ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసింది. పేదలందరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. పేదలకు భారమైన కార్పొరేట్ ఆసుపత్రుల వైపు చూడకుండా వార్డుల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్యం అందే విధంగా సకల సదుపాయాలు కల్పించారు. ఆదివారం నుంచి శనివారం వరకు రోజూ వ్యాధులను బట్టి వైద్యసేవలు అందించే విధంగా ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దారు.

ప్రసాద్‌గార్డెన్స్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే పరీక్షలు : హిమోగ్లోబిన్, తెల్ల రక్తకణాల సంపూర్ణ సంఖ్య, ప్లేట్‌లెట్స్, మలేరియా స్లైడ్ పరీక్ష, ఈఎస్ఆర్ టెస్ట్, రక్తం గడ్డకట్టే సమయం నిర్ధారణ, బ్లడ్ గ్రూప్, గర్భ నిర్ధారణ పరీక్ష, షుగర్ వ్యాధి పరీక్ష, హెచ్ఐవీ, యూరియా, సీరమ్ క్రియాటినిన్ పరీక్ష, సీరమ్ బైలురూబిన్ పరీక్ష, ఓవరీస్ పరీక్ష, ఉమ్మి పరీక్ష, ఎస్‌జీవోటీ, ఎస్‌జీటీ, సీరమ్ ఆల్కలైన్ ఫాస్పేట్ పరీక్ష, సీరమ్ టోటల్ ప్రొటీన్ పరీక్ష, సీరమ్ టోటల్ కొలెస్టరాల్ పరీక్ష, సీరమ్ ట్రైగ్లిజీరాయిడ్ పరీక్ష, సీరమ్ హెచ్‌డీఎల్, డెంగ్యూ పరీక్ష, యూరిన్ అల్బుమిన్ చెక్కర.. మైక్రోస్కోపీ పరీక్ష, మలేరియా పారాసైట్ రాపిడ్ పరీక్ష, రక్తం బ్లీడింగ్ పరీక్ష, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్ష, వైడల్ పరీక్ష (టైఫాయిడ్), వీడీఆర్ఎల్ వంటి సుమారు నలభైకి పైగా పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లోనే చేస్తున్నారు. వ్యాధులకు తగ్గట్టు మందులు కూడా ఉచితంగా సరఫరా చేస్తున్నారు.



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ఆరోగ్య కేంద్రంలో బీపీ పరీక్షిస్తున్న స్టాఫ్‌నర్స్

పరీక్షలు చేయించుకుంటున్నాను..



ఇప్పుడు ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో సీఎం జగన్‌బాబు అన్ని రకాల పరీక్షలు పెట్టడంతో నేను కూడా ఇక్కడే పరీక్షలు చేయించుకుంటున్నాను. గతంలో కేజీహెచ్‌కు వెళ్లేవాళ్లం. ఇప్పుడు వార్డులోనే శ్రమ లేకుండా వైద్య సేవలు పొందుతున్నాం. పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.

–భూలోకమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

పేదవాళ్లకు ఎంతో ఉపయోగం..



ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేస్తుండటంతో షుగర్, బీపీ పరీక్షలు చేయించుకుని నెలనెలా మందులు తీసుకుంటున్నాను. మాలాంటి పేదవాళ్లం పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేం. ఇలాగే కొనసాగిస్తే బాగుంటుంది.

–నర్సింగరావు, పండావీధి, 35వ వార్డు.

రోగుల సంఖ్య పెరిగింది..



ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు పెట్టి సౌకర్యాలు కల్పించటంతో మా ఆరోగ్య కేంద్రానికి రోగుల సంఖ్య బాగా పెరిగింది. ఎంతో మంది ఇక్కడ పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. ఇక్కడ అన్ని రకాల మందులు అందుబాటులో ఉండటంతో ఉచిత పంపిణీ కూడా సక్రమంగానే జరుగుతోంది.

–సంతోష్, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, జీవీఎంసీ 35వ వార్డు, ప్రసాద్‌గార్డెన్స్.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు గురువారం 15వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ ప్రత్యేక పూజలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. పరోక్షంగా పూజలో పాల్గొనాలనుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు పూజా రుసుం జమచేసి, పేరు గోత్రం, చిరునామా తదితర వివరాలు 89855 15989 వాట్సాప్ నంబరుకు పంపాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

2న 'నీ స్నేహం కోసం..'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : ప్రముఖ గిటారిస్ట్ కన్నాజీ స్మారకార్థం 2వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నీ స్నేహం కోసం' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సుప్రీం ఆర్కెస్ట్రా ఇంటర్నేషనల్ లైవ్ బ్యాండ్ అధినేత డాక్టర్ సుప్రీం శేఖర్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీం శేఖర్ మాట్లాడుతూ అనేక సినీ సంగీత కార్యక్రమాల్లో గిటార్ వాయిద్యంతో ఖ్యాతిగాంచిన కన్నాజీ జ్ఞాపకార్థం నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకుడు డేవిడ్, నందిత, రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, సునీత, అబిద్, అలీ తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ప్రత్యేక సంగీత వాయిద్యాలతో సీనియర్ కళాకారులు అలరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పారుల్‌కుమార్, నేవీ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కన్నాజీ తల్లి వసుందరాదేవిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గాయకులు రాజేంద్రప్రసాద్, నందిత, కీబోర్డు ఆర్టిస్ట్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ హనుమాన్ చాలీసా పారాయణ రేపు

డాబాగార్డెన్స్ : నగరంలోని అప్పయ్యనగర్‌లో వేంచేసిన భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2న వెంకటేశ్వర ఫౌండేషన్, అప్పయ్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి బి. హరినాథ్, శ్రీహరేరామ సంకీర్తన భక్త బృందం ఉపాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి సహకారంతో ఆ రోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శ్రీహరే రామ సంకీర్తన భక్త బృందం కార్యదర్శి సుధా సీతాపతిరావు నేతృత్వంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తామన్నారు.

వేడుకగా రక్షాబంధన్



ఎమ్మెల్యే వాసుపల్లికి రాఖీలు కడుతున్న మహిళలు



ప్రేమసమాజం పిల్లలకు రాఖీలు కడుతున్న ఆదిత్య కళాశాల విద్యార్థినులు

అల్లిపురం : రక్షాబంధన్ వేడుకను 32,33,34 వార్డుల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ప్రతి ఇంట్లో ఆడపిల్లలు, చిన్నవారు, పెద్దవారు తెల్లవారు జామున నిద్రలేచి, తలారా స్నానం చేసి, దేవుడికి పూజలు చేశారు. తమ సోదరుల కోసం సిద్ధం చేసుకున్న రాఖీలకు పూజలు నిర్వహించారు. సోదరుల నుదుట తిలకం దిద్ది, రాఖీలు కట్టి, పెద్దవారైతే అక్షింతలు జల్లి, చిన్నవారైతే ఆశీర్వదించారు. సోదరులు తమ సోదరిలకు బహుమతులు అందజేశారు.

ప్రేమసమాజంలో..

డాబాగార్డెన్స్ : ప్రతి ఏటా వచ్చే రాఖీ పండగ రోజున ప్రేమసమాజంలో ఉన్న మహిళలు సోదర భావంతో అక్కడే ఆశ్రయం పొందుతున్న పలువురికి రాఖీలు కట్టి అనుబంధం చాటారు. స్వీట్లు తినిపించుకుని ఘనంగా రాఖీ పండగ జరుపుకున్నారు.

చిన్నారుల నడుమ..

రాఖీ పండగను పురస్కరించుకుని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రేమసమాజంలో సోదర ప్రేమ పంచారు. కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ప్రేమసమాజంలోని చిన్నారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కడారికుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. భాస్కరరావు ప్రేమసమాజంలో మొక్కలు నాటారు.

ఏవీఎన్‌లో వృక్షా బంధన్

ఏవీఎన్ కళాశాల విద్యార్థులు కళాశాల ఆవరణలో గల పలు చెట్లకు రాఖీలు కట్టి వినూత్న కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు వృక్షాబంధన్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రకృతి, తల్లిదండ్రులు, సమాజం, బంధాల విలువల్ని తెలియజేయాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఎ. అర్చన, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎం. శ్రీనివాసరావు, విజయ్, సాగర్, ఫ్యాకల్టీ సభ్యులు ఎస్. హైమావతి, బి. మూర్తి, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లికి రాఖీలు కట్టిన మహిళలు

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు నియోజకవర్గంలో పలువురు మహిళలు రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నీలాపు లక్ష్మి, నీలమ్మ వేపచెట్టు దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, కుమారి, వలిశెట్టి లక్ష్మి, అనురాధ, అరుణ, గంగ, ఝాన్సీ, మణి, మీనా, కల్యాణి, జ్యోతి, పెద్ద ఎత్తున మహిళలు, పలు వార్డుల నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సాలయంలో..

మహారాణిపేట : మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో గురువారం జంధ్యాల పౌర్ణమి, రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్‌కు ఆయన సోదరి డాక్టర్ శిష్టా శ్రీలక్ష్మి రాఖీ కట్టారు. డాక్టర్ శిష్టా లక్ష్మీనారాయణ, చాతుర్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, రమణ పాల్గొన్నారు.



ప్రేమసమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడికి రాఖీ కడుతున్న మహిళ

ఇన్నోవేషన్ చాలెంజ్‌లో మధురానగర్ హైస్కూల్ ఫస్ట్



ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ గ్రాండ్ ఫినాలేలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పాఠశాల విద్యా శాఖ, యూనిసెఫ్ సంయుక్తంగా ఆగస్ట్ 28 నుంచి 30 వరకు విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలో సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు దుర్గా కాత్యాయిని, జోష్ నాగేంద్ర, జశ్వంత్, ప్రదీప్‌కుమార్ 'సెక్యూరింగ్ ఫారమ్స్ ఫ్రం యానిమల్స్ యూజింగ్ లేజర్ టెక్నాలజీ' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీ, రూ. లక్ష నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను విద్యార్థులు అందుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన సభలో హెచ్‌ఎం పి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతిభ చూపిన విద్యార్థులను, ప్రాజెక్టు రూపకల్పనలో గైడ్‌చేసిన సైన్స్ టీచర్ ఎం.ఎ.భ్రమరాంబను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లోకి జంతువులు వచ్చినపుడు లేజర్ లైట్ ద్వారా సిగ్నల్ వెళ్లి అలారం మోగడంతో పంటను వాటి బారి నుంచి కాపాడుకునేలా విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారన్నారు. ఇటీవల అలిపిరి మెట్ల మార్గంలో చిరుతపులి వచ్చిన సంఘటన జరిగిందని, దాని నుంచి రక్షణగా మెట్ల మార్గానికి ఇరువైపులా లేజర్ లైట్స్ సాయంతో అలారం మోగేలా చేయొచ్చని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును చూసి న్యాయనిర్ణేతలు మొదటి బహుమతి ప్రకటించారన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన 27 పాఠశాలలు ఈ తుది పోటీలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని ఆకాంక్షించారు.

కనులపండువగా.. పౌర్ణమి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



అమ్మవారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే వాసుపల్లి



ప్రత్యేక అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

అల్లిపురం : శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని గాజులు, పసుపు కొమ్ములతో అలంకరించినట్లు ఆలయ ఈవో రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషంగా పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు ఉదయం నుండి బారులు తీరారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు జోగారావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు.

సంతోషిమాత ఆలయంలో..

చలువతోటలోని సంతోషిమాత దేవాలయంలో సంతోషిమాత జన్మదినం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సంతోషిమాత అమ్మవారితో, గణపతికి రక్షా బంధనం గావించే కార్యక్రమం అద్భుతంగా చేపట్టారు.

కొత్తమ్మవారికి గాజుల అలంకరణ..

అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారు గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ నిర్వాహకులు గాజులతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.



విశేష అలంకరణలో సంతోషమాత, గణపతి



గాజుల అలంకరణలో కొత్తమ్మవారు



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న సింగరాచార్య

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

డాబాగార్డెన్స్ : మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం విఖనస మహాముని జయంతి వైభవంగా నిర్వహించారు. వైఖానస సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధార్మిక పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఆర్. సింగరాచార్య మహాముని వైభవాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్పీ ఎల్.చైతన్య వీటిని పర్యవేక్షించారు. కంచరపాలెం, కప్పరాడ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కె.కాలనీ, సుభాష్‌నగర్, రాంజీ ఎస్టేట్ తదితర పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు పాల్గొన్నారు.

సృజనాత్మకతే సంపద

ఏయూ క్యాంపస్: సృజనాత్మకతే పెద్ద సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తెలిపారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు' అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.విజయకాంతి స్మారకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్స్‌ను స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఏ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు.